## బాలికల జూనియర్ కళాశాల తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

ఖలీల్‌వాడి, జూన్ 20 : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. కళాశాలలో ప్రేయర్ సమయానికి కళాశాలకు చేరుకొని.. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి మాట్లాడారు. కళాశాలలో మరింత మెరుగ్గా ఉత్తీర్ణత ప్రతిభ కొనసాగించాలని సూచించారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలని ఆదేశించారు.

## 27 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ 18వ జాతీయ మహాసభలు

ఖలీల్‌వాడి, జూన్ 20 : కేరళ రాష్ట్రంలోని కోజికోడ్‌లో ఈ నెల 27 నుంచి 30 వరకు ఎస్‌ఎఫ్‌ఐ 18వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు జిల్లా కమిటీ సభ్యుడు రోహిత్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఐటీఐ గర్ల్స్ కళాశాలలో శుక్రవారం జెండాఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ 1970లో ఏర్పాటై, 55 ఏండ్లుగా విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తున్నదన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటీఐ యూనిట్ కమిటీ సభ్యులు సాయికృష్ణ, రేవంత్, కీర్తిరాజ్, మహేశ్వరి, శ్రీజ, బాబు, రఘు, కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం తగ్గించడానికే కొత్త 33 కేవీ ఏర్పాటు



ఇంటర్ లింకింగ్ లైన్ ప్రారంభిస్తున్న బోధన్ డీఈ మహ్మద్ ముక్తార్

కోటగిరి, జూన్ 20 : నిరంతరం విద్యుత్ సరఫరా కోసం కోటగిరి సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తగా 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ ప్రారంభించామని విద్యుత్ శాఖ బోధన్ డీఈ మహ్మద్ ముక్తార్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా 33 కేవీ ఏర్పాటు చేశామని, దీంతో కల్లూర్, కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోని కేటగిరీల వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ నాగేశ్‌కుమార్, శ్రీనివాసరావు, కోటగిరి ఏఈ బజ్జిబాబు, గంగాధర్, ప్రేమదాస్, వైద్యనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

## గీతాభవన్‌లో దంత వైద్యశిబిరం

సుభాష్‌నగర్, జూన్ 20 : నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో ఉన్న గీతా భవన్‌లో ఇందూరు నగర బ్రాహ్మణుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దంత వైద్య నిపుణుడు సంతోష్‌కుమార్ సుమారు 100 మందికి దంత పరీక్షలు చేసి మందులు అందజేశారు. దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రొట్టె సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి



రుద్రూర్ ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

రుద్రూర్,జూన్ 20 : రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డు చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్‌మెహతో అన్నారు. మండల సమీకృత భవనంలోని తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలను తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా వచ్చిన వివరాలపై ప్రశ్నించగా.. మండల వ్యాప్తంగా 300 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తారాబాయి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల గురించి ఎంపీడీవో భీంరావును అడిగి తెలుసుకున్నారు.

### దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు : ఆర్డీవో

ధర్పల్లి, జూన్ 20 : ధరణికి సంబంధించిన వారసత్వ దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచవద్దని ఆర్డీవో రాజేంద్రకుమార్ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 1,502 దరఖాస్తులు వచ్చాయని, సాయంత్రంలోగా ఇంకొన్ని పెరిగే అవకాశముందని తహసీల్దార్ శాంత ఆర్డీవోకు వివరించారు. ఎలాంటి వివాదం లేని వారసత్వ పట్టాల మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పట్టా మార్పిడికి సంబంధించిన నోటీసులు అందజేయాలని ఆర్డీవో ఆదేశించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శాంత, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఎంఆర్ఐ రాజేశ్వర్ పాల్గొన్నారు.

# అడ్వకేట్స్ సొసైటీ కార్యవర్గ ప్రమాణస్వీకారం




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి భరతలక్ష్మి

వినాయక్‌నగర్, జూన్ 20 : నిజామాబాద్ జిల్లా అడ్వకేట్స్ సహకార సొసైటీ నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణస్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి హాజరై మాట్లాడారు. సొసైటీ ఆర్థిక ప్రగతి, మరిన్ని పొదుపులకు ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. సొసైటీ ఆఫీస్ బేరర్లు అందరూ కలిసికట్టుగా ఉండి అభివృద్ధికి కృషిచేయాలని అన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బోధన్ రమేశ్, కార్యదర్శిగా వెంకటరమణాగౌడ్, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా విప్లవ్ కిరణ్‌తో ప్రమాణం స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు సాయారెడ్డి, ప్రధానకార్యదర్శి మాణిక్‌రాజు, బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూలిన ప్రజా మరుగుదొడ్లు



కూలిపోయిన మరుగుదొడ్లు

కంఠేశ్వర్, జూన్ 20 : జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయం పక్కన పాములబస్తీకి వెళ్లే దారిలో ప్రజా మరుగుదొడ్లు శుక్రవారం ఉదయం కూలిపోయి ఉన్నాయి. గతంలో ప్రజా అవసరాల నిమిత్తం నిర్మించిన ఈ మరుగుదొడ్లు రాత్రికి రాత్రి కూలిపోవడంతో పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి కూలిపోయిందా లేక ఎవరైనా కూల్చేశారా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. తిరిగి వీటిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## బోధన్ దవాఖానలో సౌకర్యాలు కల్పించాలి



ఒకేబెడ్‌పై ఉన్న ఇద్దరు పేషంట్లతో మాట్లాడుతున్న నాయకులు

శక్కర్‌నగర్, జూన్ 20: బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానను శుక్రవారం సీపీఐ, సీపీఎం నాయకులు సందర్శించారు. దవాఖానలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు. పేరుకు జిల్లా దవాఖాన అయినప్పటికీ రోగులకు కనీస వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దవాఖానలోని కాన్పుల విభాగం భవనం వర్షాలకు స్లాబు పెచ్చులూడిపోగా, ఈ వార్డును పై అంతస్తులోకి మార్చినట్లు గుర్తించారు. దవాఖానలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులను ఉంచారని, వార్డుల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయని వారు గుర్తించారు. భారీ వర్షాలు పడితే భవనం ఊరుస్తుందని, షిఫ్ట్ వారీగా విధుల నిర్వహించాల్సిన వైద్య సిబ్బంది ఆరుగురే ఉన్నారని గుర్తించారు. దవాఖానలో వారు గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. నాయకులు జె.శంకర్‌గౌడ్, ఏశాల గంగాధర్, కుమారస్వామి, జంగం గంగాధర్, పత్రి ఎల్లయ్య, దాసి గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మెడ పద్మకు డాక్టరేట్



రిజిస్ట్రార్ యాదగిరి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న పద్మ

డిచ్‌పల్లి, జూన్ 20 : టీయూ మ్యాథమెటిక్స్ విభాగంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఉమ్మెడ పద్మ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మిజోరాం నుంచి మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో డాక్టరేట్ పొందారు. 'మిక్స్‌డ్ కన్వెక్షన్ ఆఫ్ విస్కో ఎలాస్టిక్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ ఇన్ పారలెల్ ప్లేట్ ఛానల్స్ ఎంట్రోపీ జనరేషన్ అనాలసిస్' అంశంపై ఆమె సమర్పించిన థీసిస్‌కు సంబంధించి ఫైనల్ వైవా పూర్తిచేయడంతో డాక్టరేట్ సాధించారు. ఎన్ఐటీ మిజోరం మ్యాథమెటిక్స్ విభాగంలో సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ సురేందర్ పర్యవేక్షణలో పరిశోధన చేసి, పీహెచ్‌డీ సాధించారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టిన పద్మ.. టీయూలో మ్యాథమెటిక్స్ విభాగంలో 11 ఏండ్లుగా సహాయ ఆచార్యురాలి (కాంట్రాక్ట్)గా పని చేస్తున్నారు. డాక్టరేట్ సాధించడంపై టీయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, సైన్స్ డీన్, మ్యాథమెటిక్స్ విభాగాధిపతి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్

డిచ్‌పల్లి, జూన్ 20 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జీపీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో మురికి నీటి నిల్వలు లేకుండా చూడాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఐకేపీ, ఆరోగ్యసిబ్బందితో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ యోహాన్, మండల అభివృద్ధి అధికారి లింగం, మండల విద్యాధికారి శ్రీనివాస్, ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, గోవర్ధన్, సబ్‌యూనిట్ అధికారి రాజేందర్, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణానికి భూమిపూజ



చందూర్, జూన్ 20 : మండలకేంద్రంలో ఎంఈవో కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఎంపీడీవో నీలావతి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 39 లక్షలు మంజూరు కాగా.. భవన నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నగరంలో నేడు ఫుడ్ ఫెస్టివల్

కంఠేశ్వర్, జూన్ 20 : మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు, వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులు తయారుచేసిన తినుబండరాల ఉత్పత్తుల ప్రదర్శన, స్టాళ్ల ఏర్పాటు, అమ్మకాలు ఉంటాయని వివరించారు. నగర ప్రజలు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## నేడు, రేపు టీయూసీఐ రాష్ట్ర మహాసభలు

డిచ్‌పల్లి, జూన్ 20 : నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఈనెల 21, 22తేదీల్లో లో టీయూసీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు జిల్లా నాయకుడు మురళి తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో పంచాయతీ కార్మికులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నామని, జీపీ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

కోటగిరి, జూన్ 20 : మండలంలో రెవెన్యూ సదస్సులు శుక్రవారం ముగిశాయని తహసీల్దార్ మధు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, మొత్తం 200లకు పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గిర్దావర్ సయ్యద్ హుస్సేన్, అహ్మద్, మనోజ్, భీంరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## వన మహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలి

కోటగిరి, జూన్ 20 : జూలై మొదటివారంలో నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్, ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లో శుక్రవారం పర్యటించి నర్సరీల్లోని మొక్కలను పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి స్వాతిని ఉన్నారు.

## మేడ్‌పల్లిలో పోలీసుల కళాజాత

చందూర్, జూన్ 20 : మండలంలోని మేడ్‌పల్లి గ్రామంలో పోలీస్ కళాబృందం సభ్యులు గ్రామస్తులకు పలు అంశాలపై శుక్రవారం రాత్రి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షీ టీముల పనితీరు, సైబర్‌మోసాలు, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మహేశ్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌గౌడ్

రుద్రూర్, జూన్ 20 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, అప్పటి వరకు పోరాటం కొనసాగిస్తామని జాగృతి రాష్ట్ర కన్వీనర్ సంపత్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో జాగృతి యువజన సమాఖ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించగా.. ఆయన హాజరై మాట్లాడారు. జాగృతి అధ్యక్షురాలు కవిత పిలుపు మేరకు బీసీ రిజర్వేషన్ అమలు కోసం పోరాటం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టకపోతే జూలై 17న రాష్ట్రవ్యాప్తంగా రైల్‌రోకో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాఅధ్యక్షుడు అవంతిరావు, మండల ఇన్‌చార్జి గాండ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి

మోర్తాడ్, జూన్ 20: మహిళలు సంఘాల్లో చేరి ఆర్థిక సాధికారత సాధించాలని ఏపీఎం కుంట గంగాధర్ సూచించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి ఐకేపీ శిక్షణ కేంద్రంలో 29 గ్రామ సమాఖ్యలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు రవికుమార్, నవీన్, భాగ్యలక్ష్మి, పీరియ, అలేఖ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు కమల, కార్యదర్శి వాసవి, కోశాధికారి రోజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## నీరు నిల్వ ఉండకుండా చూడాలి

మాక్లూర్, జూన్ 20: మండల సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి డబ్బులు అవసరమున్న వారికి గ్రామ సంఘం ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నందున ప్రతి మహిళ తన ఇంట్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. (వయోజన విద్య) డిప్యూటీ డైరెక్టర్ గోవిందరావు ఇందూరు అక్షర లక్ష్మి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డీపీఎం నీలిమా, ఏపీఎం అనిల్, సీసీలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## సభలను విజయవంతం చేయాలి

నవీపేట/బాల్కొండ, జూన్ 20: జిల్లా కేంద్రంలో ఈ నెల 21, 22 తేదీల్లో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న టీయూసీఐ రాష్ట్ర సభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాజేశ్వర్, ఎం.వెంకట్ కోరారు. మండలంలోని ఆభంగపట్నం గ్రామంలో శుక్రవారం బీడీకార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 21, 22తేదీల్లో నిర్వహించనున్న టీయూసీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న కోరారు. మహాసభల పోస్టర్లను బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో ఆవిష్కరించారు. నాయకులు నిఖిల్, లావణ్య, మమత, పుష్ప, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గిరాల పసుపునకు డిమాండ్



పసుపు మొక్కలను రైతుకు అందజేస్తున్న పసుపుబోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి

మోర్తాడ్, జూన్ 20: జిల్లాలో పండిస్తున్న దుగ్గిరాల పసుపు రకానికి అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందని, ఇక్కడి భూముల్లో పండించడానికి అనువైన వంగడం దుగ్గిరాల అని పసుపుబోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లిలోని పసుపుపరిశోధన కేంద్రంలో పసుపు వంగడాల మొక్కలను పరిశీలించిన అనంతరం వాటిని రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. దుగ్గిరాల పసుపును పండించడంతో పాటు, ఇతర వెరైటీలను కూడా ప్రయోగాత్మకంగా పండించాలని సూచించారు. పసుపు మొక్కలు తీసుకునేందుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు, వరంగల్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల నుంచి రైతులు తరలివచ్చారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి, శాస్త్రవేత్త మహేందర్, రైతులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన ఉపాధ్యాయులు

ఏర్గట్ల, జూన్ 20: పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సుమారు 30కి పైగా వేప, కానుగ మొక్కలను పాఠశాల ఆవరణలో శుక్రవారం నాటారు. వీటి సంరక్షణ కోసం ట్రీ గాడ్స్ ఏర్పాటు చేస్తామని పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం కృష్ణచారి తెలిపారు. నిత్యం మొక్కలకు నీటిని అందించేందుకు విద్యార్థులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

భీమ్‌గల్/నందిపేట్, జూన్ 20: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని అన్ని గ్రామాల్లో చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి అజయ్ పవార్ అన్నారు. శుక్రవారం భీమ్‌గల్ ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఐసీడీఎస్, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన పమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ, డాక్టర్ మౌనిక, ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఐపీడీఎస్ సూపర్‌వైజర్ శారధ, ఎంపీవో శివచరణ్, సిబ్బంది పాల్గొన్నారు. నందిపేట్ జడ్పీహెచ్‌ఎస్‌లో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు.

*అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకొని జిల్లాలోని పలు చోట్ల శుక్రవారం యోగాడేను నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మారుతీనగర్‌లో ఉన్న స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో సుమారు 30 మంది మానసిక దివ్యాంగులు వేసిన యోగాసనాల ప్రదర్శన ఆకట్టుకున్నది. ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమాధికారిణి రసూల్ బీ హాజరై మాట్లాడారు. మోపాల్‌లో గ్రామ పెద్దలు చిన్నారులతో యోగాసనాలు వేయించారు. మాక్లూర్ మండలం చిన్నాపూర్, మాక్లూర్, మదన్‌పల్లి, అమ్రాద్, సట్లపూర్ తండా, చిక్లీ, అమ్రాద్ తండా, మానిక్‌బండార్ తదితర గ్రామాల్లో యోగా డేను నిర్వహించారు. యోగా గురువు ఒడ్డెన్న యాదవ్ ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.*

*–ఖలీల్‌వాడి/ మోపాల్/మాక్లూర్, జూన్ 20*



మానసిక దివ్యాంగుల పాఠశాలలో యోగాసాలు వేస్తున్న విద్యార్థులు



మోపాల్ మండల కేంద్రంలో చిన్నారులు

## సంక్షిప్తంగా..

- **విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ -** వేల్పూర్, జూన్ 20: మండలంలోని కుకునూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రభుత్వం అందజేసిన నోట్‌బుక్స్‌ను హెచ్‌ఎం హరిచరణ్ విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలలోని 75 మంది విద్యార్థులకు వీటిని అందజేశామన్నారు.
- **దుస్తులు.. -** బోధన్, జూన్ 20: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) లోని ఐదుగురు అనాథ విద్యార్థులకు శుక్రవారం ఒక జత దుస్తులను అందజేశారు. రాకాసిపేట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ యూనియన్ వార్షికోత్సవం సందర్భంగా ఆ యూనియన్ ప్రతినిధులు దుస్తులను అందజేశారు. యూనియన్ కార్యదర్శి నాగరాజు, అసిస్టెంట్ కార్యదర్శి రాధిక, హెచ్‌ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **హాస్టల్ విద్యార్థులకు రవాణా సౌకర్యం ఏర్పాటు -** బాల్కొండ, జూన్ 20: మండల కేంద్రంలోని బీసీ బాలుర సమీకృత వసతిగృహం జడ్పీహెచ్‌ఎస్‌కు నాలుగు కిలోమీటర్లు దూరం ఉన్నందున విద్యార్థులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కాలినడకన వెళ్లి వచ్చేందుకు అవస్థలు పడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.
- **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం-** మాక్లూర్/నవీపేట, జూన్ 20: మూడో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 7 గంటల వరకు నందిపేట్, మాక్లూర్, నవీపేట్ మండలాల 33/11 కేవీ ఉపకేంద్రాల వద్ద నెలవారి మరమ్మతులు నిర్వహించనున్నట్లు డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.
- **విద్యార్థులకు అక్షరాభ్యాసం-** భీమ్‌గల్, జూన్ 20: పట్టణంలోని బోయిగల్లీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఎంఈవో స్వామి అక్షరాభ్యాసం నిర్వహించారు. హెచ్‌ఎం రమేశ్, ఉపాధ్యాయులు అశోక్, ఎం. మహేశ్, రాధిక, లింబాద్రి, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.
- **షీటీంపై అవగాహన -** రెంజల్, జూన్ 20: నీలా జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం షీటీంపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, పోకిరీల వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. హెచ్‌ఎం ఇల్తేపు శంకర్, షీటీం అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **పాఠశాలకు మైక్‌సెట్ వితరణ-** మోర్తాడ్, జూన్ 20: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్‌ను మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుంకెట బుచ్చన్న వితరణగా ఇచ్చారు. ఈసెట్‌ను శుక్రవారం హెచ్‌ఎం సాయన్నకు అందజేశారు. నాయకులు బుచ్చి మల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- **పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాల అందజేత-** బాల్కొండ, జూన్ 20: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక్కో పాఠశాలకు 115 పుస్తకాలు చొప్పున గ్రంథాలయ పుస్తకాలను ఎంఈవో రాజేశ్వర్ శుక్రవారం పంపిణీ చేశారు. రాష్ట్రప్రభుత్వం నుంచి వచ్చిన కథలు, సైన్స్, గణితం, విజ్ఞానం, బాలసాహిత్యం పుస్తకాలను అందజేశామని ఎంఈవో తెలిపారు.
- **ఫ్రైడేడ్రైడే..-** మోర్తాడ్, జూన్ 20: కమ్మర్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని మోర్తాడ్ మండలం పాలెం గ్రామంలో, కమ్మర్‌పల్లిలో శుక్రవారం హెల్త్ సూపర్‌వైజర్ మారుతి ఆధ్వర్యంలో ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం, నీటినిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.
- **ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలి-** ఆర్మూర్‌టౌన్, జూన్20: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. శుక్రవారం ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు కుతాడి ఎల్లయ్య, శర్మ తదితరులు పాల్గొన్నారు.
- **ప్రభుత్వ కళాశాలలోనే చేరండి-** భీమ్‌గల్, జూన్ 20: ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు అందులోనే చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో అధ్యాపకులు మండలంలోని బాబాపూర్, పురాణీపేట్ గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.
- **రాహత్‌నగర్‌లో 'బీజేపీ' రచ్చబండ-** భీమ్‌గల్, జూన్ 20: మండలంలోని రాహత్‌నగర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆరె రవీందర్ మాట్లాడారు. ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా లింబాద్రినాయక్, ఉపాధ్యక్షుడిగా రామావత్ వెంకటేశ్ నాయక్‌ను ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**PASSPORT LOST**
★నేను GATLA THARUN S/o. Gatla Gangadhar, R/o.H.No.3-27, Vill: Amrad, Mdl: Makloor, Nizamabad Dist. నా యొక్క పాస్‌పోర్ట్ నెం. S1956217 గలది. తేది: 20.01.2025న అమ్రాద్ నుండి మాక్లూర్ వెళ్ళే మార్గంలో పోయింది దొరికినవారు సంప్రదించు సెల్ నెం. 9618560811
NTZ-336106

**పాలసీబాండ్ పోయినది**
Mr.సముద్రాల సాయిక్రిష్ణ, ఇ.నెం.1-55, వంగపాడ్, హసన్‌పర్తీ, వరంగల్, పిన్ 506006, ఎస్‌బిఐ లైఫ్ పాలసీబాండ్ పాలసీబాండ్ నెం.1K601104506 కామారెడ్డి జయశంకర్ కాలనీ నుండి కామారెడ్డి బస్టాండ్‌కు బైక్ పై వెళ్ళేమార్గంలో పోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్ నెం. 63033 77379.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## అనుమానాస్పద స్థితిలో ఇల్లు దగ్ధం

నందిపేట్, జూన్ 20: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గురువారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో ఓ ఇల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. కాలనీలోని దుర్గామండపం వద్ద ఉన్న తన ఇంట్లో కోయల్కర్ లావణ్య కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నది. వీరు రెండు మూడు నెలల నుంచి ఆదిలాబాద్‌లోని వారి బంధువుల వద్ద ఉంటున్నారు. గురువారం రాత్రి 11.30 గంటలకు ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడంతో పక్క గదిలో అద్దెకు ఉంటున్న శిరీష బయటికి వచ్చి కేకలు వేయడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను ఆరే ప్రయత్నం చేశారు. గ్యాస్ సిలిండర్లను ఇంట్లోని బయటికి తీశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని కాలనీ వాసులు పేర్కొన్నారు. ఇంట్లోని విలువైన వస్తువులన్నీ కాలిపోయాయి. ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉందని అద్దెకుంటున్న రొయ్య శిరీష తెలిపారు. ప్రమాదం ఎలా జరిగింది, ఇంటి తాళం ఎవరు పగలగొట్టారు అనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిసారించాలి

ఏర్గట్ల, జూన్ 20: వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిసారించాలని జిల్లా ఉద్యాన శాఖ, ప్రీ యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీ సంయుక్తంగా మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించాయి. గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన రైతు సోమ రాజారెడ్డి నాలుగెకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య, తాళ్లరాంపూర్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ లింగారెడ్డి, ఉద్యానశాఖ అధికారి రుద్ర నాయక్ రైతులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వైష్ణవ్, విస్తరణ అధికారి సచిన్, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధి ప్రేమ్ సింగ్ పాల్గొన్నారు.

## దొంగకు దేహశుద్ధి

ఆర్మూర్‌టౌన్, జూన్20: పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలో శుక్రవారం వ్యవసాయ బోరు మోటర్లను దొంగిలించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న దొంగను రైతులు, స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఇటీవలే పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో బోరు మోటర్లు చోరీకి గురవుతున్నాయి. శుక్రవారం దొంగ వ్యవసాయ బోరు మోటర్ల విక్రయానికి ప్రయత్నిస్తున్న తరుణంలో స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం ఆర్మూర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

## అర్బన్ పార్కులో క్షేత్రవనం ఏర్పాటు

మాక్లూర్, జూన్ 20: మండలంలోని చిన్నాపూర్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుశీల్ కుమార్, బ్యాంకు ఎంప్లాయి అన్నపూర్ణ దంపతుల కూతురు చైత్ర ఐదో పుట్టిన రోజు సందర్భంగా అర్బన్ పార్కులో శుక్రవారం క్షేత్రవనం ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మాట్లాడుతూ 5వ సంవత్సరంలో 50 మొక్కలు, 6వ ఏట 60 , 7వ ఏటా 70 మొక్కలు, 60వ ఏట దాదాపు 20వేల మొక్కలు, 100 సంవత్సరాలు వచ్చే వరకు ఈ కార్యక్రమం నిరంతరం చేపట్టి 50వేలకు పైగా మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. మామిడిపల్లి చిన్నాపూర్ శివారులోని అరణ్య అర్బన్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ భవాని శంకర్, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆర్మూర్ డివిజన్ రేంజ్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.